మెట్రోలో పార్కింగ్ చార్జీల వసూలు తగదు

లిబర్టీ: మెట్రో రైల్ ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీల వసూళ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్ కోరారు. మెట్రో ప్రయాణికులకు ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ మేరకు శనివారం మెట్రో రైల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకొని, వాటిలో ఎటువంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రయాణికుల వద్ద పార్కింగ్ చార్జీల పేరుతో దండుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు.

రహమత్‌నగర్‌లో కర్రపూజ



కర్రపూజ నిర్వహిస్తున్న కమిటీ అధ్యక్షుడు బండపల్లి భవానీశంకర్

రహమత్‌నగర్: రహమత్‌నగర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు శనివారం రహమత్‌నగర్ కూడలిలో కర్రపూజ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం కమిటీ నిర్వాహకులు కర్రను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు బండపల్లి భవానీశంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైవిధ్యభరితమైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఈసారి లంబోధర రూపంలో వినాయకున్ని ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, నిజామాబాద్ శ్రీనివాసగుప్త, నటరాజ్ యాదవ్, మునిస్వామి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లోరిన్ మాత్రల పంపిణీ

బంజారాహిల్స్: మంచినీటి సరఫరా వేళల్లో బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని షౌకత్‌నగర్ బస్తీలో శనివారం జలమండలి జీఎం హరిశంకర్ పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ నీటినాణ్యతను పరిశీలించారు. అనంతరం ప్రతీ ఇంటికి 20 క్లోరిన్ మాత్రలను అందజేశారు. నీటిబిందెల్లో క్లోరిన్ మాత్రను పొడిగా చేసి వాడుకోవాలని, దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కలుషిత నీరు సరఫరా అయినా, నీటి ప్రెషర్ తగ్గినా తమకు సమాచారం ఇవ్వాలని, వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

దోమలవ్యాప్తిని అరికట్టాలి



బంజారాహిల్స్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, డెంగీతోపాటు ఇతర జ్వరాల నుంచి విముక్తి పొందవచ్చని జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 యూసీడీ డీపీవో ఆశావిరోనిక అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో రాఘవేంద్ర స్కూల్‌లో డెంగీ వ్యాధిపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

పరివారోత్సవ్



పరివారోత్సవ్‌లో సంస్కార్ స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు తమలోని ప్రతిభకు పదునుపెట్టి చేసిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో పరివారోత్సవ్ పేరిట పలు పండుగల విశిష్టతను తెలుపుతూ ప్రదర్శనలు చేశారు. శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితితో పాటు పలు పండుగల పేరిట చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శనేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి

ఖైరతాబాద్: శని త్రయోదశి సందర్భంగా శనివారం మింట్ కాంపౌండ్‌లోని శనేశ్వర దేవాలయం వద్ద భక్తులు క్యూ కట్టారు. ఉదయం నుంచి భారీగా భక్తులు శనేశ్వరుడిని దర్శించుకునేందుకు తరలిరావడంతో అర కిలోమీటర్ మేర భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.

వావ్.. ప్రతిభా దర్శన్



ప్రతిభా దర్శన్ కార్యక్రమంలో చిన్నారుల అద్భుత ప్రదర్శన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'సామాజిక విలువలు' అనే అంశంపై రెండో తరగతి విద్యార్థులు నిర్వహించిన 'ప్రతిభా దర్శన్'కార్యక్రమం ఆలోచింపజేసింది. ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉన్న నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. నృత్యం, సంగీతం, నాటకం, నృత్య నాటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం.వరలక్ష్మీ మాట్లాడుతూ మానవీయ విలువలు మన జీవితాల్లో ముఖ్యమైనవని అన్నారు. సంప్రదాయాలతోపాటు పిల్లలకు సామాజిక విలువలు ఎంత ముఖ్యమైనవనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు. నీతి కథలను చెప్పడం ద్వారా పిల్లలకు విలువలు అబ్బుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విదుమోహన్, కాంచనవల్లి పాల్గొన్నారు.

రహదారులన్నీ ఛిద్రం
- ఇంకా దృష్టిసారించని ఇంజనీర్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- గణేశ్ ఉత్సవాల నాటికి గుంతలను పూడ్చేనా..?



మంత్రులు చెప్పినా..
కానరాని మరమ్మతులు

బంజారాహిల్స్: మంత్రులు చెప్పిన మరమ్మతు మంత్రం ఇంకా పారలేదు. ఛిద్రమైన రహదారులే ఇంకా దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. మరోవైపు వినాయక చవితి ముహూర్తం సమీపిస్తోంది. గణేశ్ ఉత్సవాల నాటికి రహదారులపై గుంతలు కానరాకుండా మరమ్మతు చేయాలని మంత్రులు గట్టిగా చెప్పినా అధికారులు పెడచెవిన పెట్టారు. సెప్టెంబర్ 7వ తేదీన జరగనుండగా 17వ తేదీన విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఇప్పటికే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులు వివిధ విభాగాల అధికారులతో నాలుగు రోజుల క్రితం గణేష్ ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్లపై గుంతలు పూడ్చాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 17న జరిగిన సమీక్షా సమావేశంలోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సమక్షంలోనే పండుగ నాటికి రోడ్లపై గుంతలు పూడ్చాలని, ఇదే మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటిదాకా ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు.

వారం ముందుగానే విగ్రహాల తరలింపు..

రోడ్లపై గుంతలు ప్రజలకు పరీక్షగా మారాయి. సెప్టెంబర్ 7న పండుగ సందర్భంగా వినాయక విగ్రహాలను మండపాలకు తరలించే కార్యక్రమాలు వారం ముందుగానే ప్రారంభమయ్యాయి. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేటప్పుడు కూడా ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లపై గుంతలు పూడ్చాలని ఉత్సవ కమిటీ నేతలు కూడా డిమాండ్ చేశారు. అయితే గుంతలు పూడ్చటంలో ఇంకా ఇంజనీరింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నిర్వాకం అడుగడుగునా కళ్లకు కడుతోంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీ రమేష్ సెలూన్ చౌరస్తాలో రోహిణ్‌రెడ్డి ఇంటికి ఇవతల రోడ్డంతా ధ్వంసమై రెండేళ్లు కావస్తున్నా ఇప్పటిదాకా మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డు నెంబర్–12 నుంచి ఏసీబీ కార్యాలయానికి వెళ్లే రోడ్డంతా ఛిద్రమైంది. వాహనాలు ఈ గుంతల్లో పడి అటూ ఇటూ ఊగుతున్నాయి. గణేష్ విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలు ఈ గుంతల్లో ఎక్కడ బోల్తాపడతాయోనని ఉత్సవ కమిటీ ప్రతినిధులు బిక్కుబిక్కుమంటున్నారు. జూబ్లీహిల్స్, శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట, సోమాజిగూడ, ఖైరతాబాద్ చింతల్‌బస్తీ, ఫిలింనగర్, బంజారాహిల్స్, అమీర్‌పేట.. ఇలా ఎక్కడ చూసినా ప్రధాన రోడ్లతోపాటు బస్తీలు, కాలనీలకు వెళ్లే అంతర్గత రహదారులు కూడా గుంతలమయమయ్యాయి.



ఎమ్మెల్యే కాలనీ రమేష్ సెలూన్ చౌరస్తాలో గుంతలు తేలిన రోడ్డు

ప్రతియేటా మొత్తుకుంటున్నా..

వినాయక నిమజ్జనంలో గుంతలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ప్రతియేటా సమావేశంలో మొత్తుకుంటున్నా గుంతలు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా నిమజ్జన శోభాయాత్ర గుంతలు లేని రోడ్లపై ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, ఊగిసలాటలు లేకుండా కొనసాగుతుందా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒక్క బంజారాహిల్స్‌లోనే ఆరేడు చోట్ల రోడ్లు శిథిలమై ప్రజలను నరకం చూపుతున్నాయి. ఫిలింనగర్ బస్తీల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి కూడా రోడ్లు సరిగా లేవు.

ఈటలపై ప్రొ. నాగేశ్వర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

పంజగుట్ట: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ అంటే అందరికీ గౌరవమని, కానీ నిత్యం ప్రజాసమస్యలపై ఉద్యమించే ఈటలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు ఆగ్రహంవ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, బీసీ సంఘం నాయకుడు సాయి కిరణ్, ఉస్మానియా యూనివర్సిటీ నాయకుడు నెహ్రూ నాయక్ మాట్లాడుతూ ఈటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నాగేశ్వర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. చెరువుల్లో పెద్దలు ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చితే ఎవరూ వ్యతిరేకించరని, కానీ హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకుని అప్పులు చేసి పేదలు, మధ్యతరగతి వారు నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చడం సరికాదన్నారు.

ఎమ్మెల్యే దానంకు ఆహ్వానం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో అత్యంత అద్భుతంగా రూపుదిద్దుకుంటున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తొలిపూజకు హాజరు కావాలని కోరుతూ శనివారం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఖైరతాబాద్ అడ్‌హక్ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్ యాదవ్, ఎం.రాంరెడ్డి, కృష్ణయాదవ్, బాక్సర్ అశోక్, మహేందర్‌బాబు, అనిల్‌కుమార్, మహేష్‌యాదవ్, చంద్రశేఖర్ చందు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

విషజ్వరాల పరీక్షలు నిర్వహించాలి

రహమత్‌నగర్: వర్షాల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా జీహెచ్‌ఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ నియోజక వర్గ అధ్యక్షుడు తంగలపెల్లి లక్ష్మణ్ కోరారు. మురికివాడల్లో దోమలు విజృంభిస్తుంటే తూతూమంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అలా కాకుండా ప్రతి బస్తీలో ఫాగింగ్ చేయాలని సూచించారు. డెంగీ లాంటి విషజ్వరాలను నిర్ధారించే పరీక్షలన్నీ బస్తీ దవాఖాల్లో అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

శోభాయాత్ర రూట్‌ను పరిశీలించిన అధికారులు

బంజారాహిల్స్: సెప్టెంబర్ 7 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న గణేష్ నవ రాత్రులు, నిమజ్జన శోభాయాత్ర రూట్‌ను శనివారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 డీసీ రజనీకాంత్‌రెడ్డితోపాటు పంజగుట్ట ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. వీరితోపాటు యూబీడీ అధికారులు, ఇంజనీర్లు కూడా ఉన్నారు. శోభాయాత్ర జరిగే ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

కుకీ–జో కమ్యూనిటీని టార్గెట్ చేసిన బీజేపీ

హైదరాబాద్ కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్

కాచిగూడ: మణిపూర్ ప్రాంతంలో కొనసాగుతున్న సంక్షోభంలో కుకీ–జో కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుని, పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని హైదరాబాద్ కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆరోపించింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లూన్ డౌంగేల్, ప్రధాన కార్యదర్శి టోంగ్మిన్ థాంగ్ హాకీఫ్, కోశాధికారి గ్రేసీ ఖోంగశాస్, జైసీ చెంగ్లోమ్, ప్రాన్సిస్ హాస్కిప్ తదితరులు మాట్లాడారు. మణిపూర్ సీఎం ఎన్.బీరేన్ సింగ్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం నిర్వహించిన జాతినిర్మూలన ప్రచారంలో 41వేల మందికి పైగా కుకీ–జోలు స్థాన భ్రంశం చెందారని, 200కు పైగా కుకీ–జోలు నివసిస్తున్న గ్రామాలు, 191 మంది ప్రాణాలు కోల్పోవడానికి దారి తీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుకీ మహిళలపై క్రూరమైన లైంగిక దాడులు, హత్యలు జరిగాయని, చిన్న పిల్లలను దహనం చేశారని ఆరోపించారు. లీకైన సీఎం బీరేన్ సింగ్ ఆడియో మణిపూర్ సంక్షోభం మొత్తం స్వరూపాన్ని వివరించే తిరుగులేని సాక్ష్యంగా ఉందని అన్నారు.

తమిళనాడు వైద్యకళాశాలల్లో బసవతారకం వైద్యుల శిక్షణ

బంజారాహిల్స్: తమిళనాడు ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేసే సర్జికల్ అంకాలజిస్టులకు గైనకలాజికల్ క్యాన్సర్ల చికిత్సపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఎంపిక చేశారు. జపాన్ అంతర్జాతీయ సహకార ఏజెన్సీ(జేఐసీఏ) వారి సహకారంతో తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ నియంత్రణ, నివారణ ప్రాజెక్టులో భాగంగా రెండు వారాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెడికల్ డైరెక్టర్ సుబ్రహ్మణేశ్వరరావు తెలిపారు.

కాంట్రాక్టర్ల వేధింపుల నుంచి కాపాడండి

ఇసుక లారీ యజమానుల ధర్నా



మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆటోనగర్ ఇసుక లారీ యజమానులు

లక్డీకాపూల్: ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లతో తమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని ఆటోనగర్ ఇసుక లారీ యజమానుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఖైరతాబాద్‌ని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ముందు ఇసుకు లారీ యజమానులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుర్వీరాజు గౌడ్ మాట్లాడుతూ అధికారికంగా ప్రభుత్వానికి డీడీ తీసి క్వారీల వద్దకు వెళ్తున్నా కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో రూ.4 వేల నుంచి 5 వేల వరకు, అదనపు బకెట్ పేరుతో రూ.2 వేలు, పట్టా, జేసీబీ, గ్రామ పంచాయతీల పేరిట రూ.వెయ్యి, కాంటా పేరుతో రూ. 200.. ఇలా ఒక్కో లారీకి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు అధికారులు తనిఖీలు చేసినప్పుడు ఓవర్ లోడ్ పేరుతో లారీ యజమానులు కేసుల పాలవుతూ, జరిమానాలు చెల్లించాల్సి వస్తోందన్నారు. అనంతరం సంస్థ జీఎం రాజశేఖర్‌రెడ్డికి సమస్యపై వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన జీఎం రెండురోజుల్లో ఈ సమస్యపై సంబంధిత శాఖ చైర్మన్, అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తపేట లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నర్రి వెంకన్న, నాయకులు బల్వంత రెడ్డి, నాగేందర్ రెడ్డి, రాజు ముదిరాజ్, కాసుల జంగయ్య గౌడ్, ఆకుల శ్రీను, లగ్గొని శ్రీనివాస్, రాజేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో పలువురు ఉద్యోగుల పదవీ విరమణ

లక్డీకాపూల్: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు రిటైరై వెళ్లిపోవడం బాధగా ఉందని నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ అన్నారు. ఆసుపత్రిలోని పలువురు ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో పదవీ విమరణ చెందిన వాళ్లను ఘనంగా సత్కరించారు. వారు ఆస్పత్రి అభివృద్ధికి అందించిన సేవల్ని కొనియాడారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించే క్రమంలో చేపట్టే భవిష్యత్ పరిపాలనా సంస్కరణలకు విశ్రాంత ఉద్యోగుల సేవలు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో బిల్లింగ్ ఇన్‌చార్జి, డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రాజ్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్ సత్య గీత, సీనియర్ మెడికో సోషల్ వర్కర్ పార్వతి, ఎక్సరే టెక్నీషియన్లు ఇందిర, ఆనంద్ రావు, సెక్రటేరియల్ అసిస్టెంట్ విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎస్.లక్ష్మీభాస్కర్, ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, నిమ్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యాగౌడ్, తెలంగాణ ఉద్యోగుల సంఘం నిమ్స్ అధ్యక్షుడు మంచికట్ల రాజ్ కుమార్, పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు శాంతి, కార్యదర్శి ఎస్‌ఎస్ శేఖర్, మాజీ అధ్యక్షులు గిరిజా మనోహర్, శ్రీనివాసులు, నిమ్స్, ప్రభుత్వ అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను వేధిస్తున్న గురుకుల సిబ్బందిని సస్పెండ్ చేయాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

లిబర్టీ: గురుకులాల విద్యార్థులపై భౌతిక, మానసిక దాడి చేస్తున్న ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. ఎస్సీ గురుకులాల కార్యదర్శి, బాలల హక్కుల సంరక్షణ కమిషన్, మహిళా కమిషన్ వెంటనే గురుకులాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలమాకుల ఎస్సీ గురుకులంలో జరుగుతున్న దాడులపై రంగారెడ్డి ఈస్ట్, హైదరాబాద్ రీజినల్ కోఆర్డినేటర్‌ని ఫోన్‌లో సంప్రదిస్తే ఆ సమస్య కస్తూర్బా విద్యా సంస్థలదని తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. గురుకుల కార్యదర్శితో మాట్లాడితే ఎస్‌ఎంఎస్ చేయాలని సమాధానమివ్వడం చూస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద గురుకులాల విద్యార్థులపై వారికి ఏ మాత్రం మానవత్వం లేదని తెలిపోయిందన్నారు. ప్రభుత్వమే బాధ్యత వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే మొత్తం కుల సంఘాలు కలిసి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు బైక్‌లు మాయం

వెంగళరావునగర్: రెండు వేర్వేరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు మాయమైంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ నివాసి ఎండీ అజారుద్దీన్ ప్రైవేట్ ఉద్యోగి. ఆగస్టు 29న రాత్రి విధులు ముగించుకుని వచ్చి ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూడగా అది కనిపించలేదు. సారథి స్టూడియో సమీపంలో నివసించే వి.సూర్య జగన్నాథం 29వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. తిరిగి ఉదయం బయటకు వచ్చి చూడగా అది కనిపించలేదు. రెండు సంఘటనల్లో బాధితులు చుట్టు పక్కల విచారించినా వాహనాల ఆచూకీ లభించకపోవడంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలి

- దీపాదాస్ మున్షీకి సీఎన్ రెడ్డి వినతి

రహమత్‌నగర్: పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో యువకులకు ప్రాధాన్యత కల్పించాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆమె నివాసంలో శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తున్నదని కొనియాడారు. తాను చేసిన విజ్ఞప్తిపై దీపాదాస్ మున్షీ సానుకూలంగా స్పందించారని సీఎన్ రెడ్డి తెలిపారు.

పప్పు, బగారా బైగన్ రుచి చూపించా

- యోగితా నగారా



బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మక యూకే మాస్టర్ చెఫ్ కాంపిటీషన్–2024లో మూడోస్థానం దక్కించుకున్న నగరవాసి యోగితా నగారాను శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో మెహిఫిల్ సంస్థ అధినేత జలీల్ అఫ్రోజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యోగితా నగారా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 30 వేల మందికిపైగా ఈ పోటీల్లో పాల్గొన్నారని, ఇందులో తాను మూడో స్థానం వరకు వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. అక్కడి న్యాయ నిర్ణేతలకు తాను చేసిన పప్పు, బగారా బైగన్, కోకోనట్ రైస్ బాగా నచ్చాయని చెప్పారు. తెలుగు వంటకాల ప్రత్యేకతలను తాను అక్కడి వారికి వివరించానని తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తున్న యువతిపై అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్: నడుచుకుంటూ వెళుతున్న యువతిపట్ల ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన యువతి(20) తన స్నేహితురాలితో కలిసి శనివారం గుడికి వెళ్ళింది. పూజ అనంతరం ఇంజనీర్స్ కాలనీ మీదుగా తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఆమె కేకలు వేయడంతో యువకుడు అక్కడ నుంచి పారిపోయాడు. దాంతో యువతి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీటీవీ ఆధారంగా యువకుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'కృష్ణ పెరల్స్'కు ఏసియా బిజినెస్ లీడర్ అవార్డ్



ఏసియా బిజినెస్ అవార్డుతో కృష్ణ పెరల్స్ సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: నగరానికి చెందిన కృష్ణ పెరల్స్ అండ్ జ్యువెలరీ సంస్థను ప్రతిష్ఠాత్మక ఏసియా బిజినెస్ లీడర్ అవార్డ్–2024 వరించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు దేవేంద్రకుమార్, అంకిత్ అగర్వాల్ శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని, గడిచిన 40 ఏళ్లుగా వినియోగదారులు మెచ్చిన ఆభరణాలను నాణ్యతతో అందిస్తున్నందుకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని అన్నారు. సింగపూర్‌లోని ఓ ప్రముఖ సంస్థ తమకు ఈ అవార్డును అందజేసిందని తెలిపారు.